# క్యాండీలూ కల్తీమయం







# కార్పెంటర్ షాపులో ఫర్నిచర్ దగ్ధం


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## పోతంగల్ తహశీల్దార్‌గా విష్ణు



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ తహశీల్దార్‌గా కె.విష్ణు నియమితుల య్యారు. ఈ మేరకు ఆయన గురు వారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పోతంగల్ ఇన్ ఛార్జి తహశీల్దార్‌గా నాయబ్ తహశీల్దార్ హాజీజ్ పనిచేస్తుండగా గురువారం ఆయన విష్ణుకు బాధ్యతలు అప్పగించారు. జగిత్యాలలో డీటీగా పనిచేస్తున్న విష్ణు ప్రమోషన్‌పై పోతంగల్‌కు తహశీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్లు, జీపీవో తదితరులు పాల్గొన్నారు.





శోభాయాత్రలోని రాముడు, శివుడు, దత్తాత్రేయుడు, భరతమాత, శివాజీ విగ్రహాలు



# జై బోలో హనుమాన్‌కీ..

- ఇందూరులో వైభవంగా శోభాయాత్ర
- ఉమ్మడి జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు

రామ్ లక్ష్మణ్ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ నినాదాలతో ఇందూరు మార్మోగింది. నగరంలో విశ్వహిందూ పరిషత్, హిందూ సమ్మేళనం, బజరంగ్‌దళ్ హనుమాన్ దీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. భక్తులు వెంట రాగా.. వారి జయజయధ్వానాల మధ్య ఆంజనేయస్వామి యాత్రను కంఠేశ్వర్ ఆలయం వద్ద ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. నగర మేయర్ ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు. యాత్రం కంఠేశ్వర్ మీదుగా జెడ్పీ ఆఫీస్, పాత ప్రభాత్ టాకీస్, గాంధీ చౌక్ మీదుగా ఆర్ఆర్ చౌరస్తా వరకు చేరింది. యువకులు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా హన్మంత్ జయంతి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు.

—అక్షరటుడే, ఫొటోగ్రాఫర్/నెట్‌వర్క్




హనుమాన్ వేషధారణలో..



యాత్రలో పాల్గొన్న నాయకులు



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



సారంగపూర్‌లో భక్తుల క్యూ















## హనుమాన్ శోభాయాత్రకు పటిష్టమైన బందోబస్తు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** హనుమాన్ శోభాయాత్రకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నగరంలో యాత్ర వెళ్లే రూట్‌ను పర్యవేక్షించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల ద్వారా యాత్ర వెళ్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి,



స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి, ఐటీ కోర్ ఎస్సై నిషిత్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## గ్రామసభపై అధికారుల నిర్లక్ష్యం

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో గ్రామసభ గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 12.30 దాటినప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభకు సంబంధించి ముందస్తుగా సమాచారం ఇచ్చిన నేపథ్యంలో సభకు వారంతా సమయానికి హాజరయ్యారు. అయితే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడం.. సభను ప్రారంభించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమమైన గ్రామసభను ఇంత నిర్లక్ష్యంగా నిర్వహించడం సరైన విధానం కాదని వారన్నారు. తీరిగ్గా అధికారులు 12.30 రావడంపై వారు ఆగ్రహించారు.




## ప్రజాపాలనలో వేగంగా అభివృద్ధి: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజా పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం దోమకొండలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. గ్రామంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్స్ ఇతర పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామసభలో భాగంగా గ్రామస్థులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఆరోగ్య సేవల మెరుగుదల, రహదారుల నిర్మాణం వంటి పలు రంగాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, 99 రోజుల ప్రణాళిక ద్వారా ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలితాలు కనిపిస్తాయన్నారు. దోమకొండ మండలంపై ప్రత్యేకంగా దృష్టి సారించి అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో



జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుమోహన్, గ్రామ సర్పంచ్ ఐరేని నర్సయ్య, భిక్కనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాత రాజు, మాజీ జడ్పీటీసీ తిరుమల గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని షబ్బీర్ అలీ పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం 30 పడకల దోమమండ ఆస్పత్రిని 50 పడకలుగా మార్చింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులను పరామర్శించిన షబ్బీర్ అలీ వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో చర్చించారు.

## విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ మేరకు గురువారం బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని ఆయా తరగతి గదులను సందర్శించారు. పరీక్షల నిర్వహణ సరళిని కలెక్టర్ పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందితో ఎవరైనా సెల్‌ఫోన్లు తెచ్చారా అని ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు తేకూడదని.. కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని నిర్వాహకులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా.. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్నాపత్రాల సీళ్లు తెరిచారా లేదా అని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మంగళ ఉన్నారు.



## గ్రామాల సమగ్రాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం: గడుగు గంగాధర్



**అక్షరటుడే, మాక్లూర్:** గ్రామాలు బాగుపడినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు కమిటీ సభ్యులు గడుగు గంగాధర్ అన్నారు. గాంధీజీ కళలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రజా పాలనప్రగతి నివేదన భాగంలో గురువారం మామిడిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని గాలికివదిలేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు బోనస్, భరోసా, ఉచిత కరెంటు, రుణమాఫీ లతో పాటు మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. 99 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను సమగ్రంగా పొందుపర్చాలని సూచించారు. అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, సర్పంచ్ లత తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్దాం: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్దామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా వినాయక్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని వివరించారు. అన్యాయాన్ని ఎదురించేందుకు పాపన్న గౌడ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి సుజయ్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా పట్టణాలు, పల్లెల్లో ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు. తాగే పాలు, తినే కూరలు, ఇతర ఆహారాలను కల్తీచేస్తూ కొందరు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. మార్కెట్‌లో నూనె, అల్లంవెల్లుల్లి పేస్ట్, పన్నీర్ ఇలా ఎటు చూసినా కల్తీ వస్తువులే దొరుకుతున్నాయి. చివరికి చిన్న పిల్లలు తినే ఐస్ క్రీం, చాక్లెట్లు, బిస్కెట్లను సైతం కొందరు వ్యాపారస్తులు కల్తీకి పాల్పడుతున్నారు. దీంతో కొన్ని పంచాయతీలు క్యాండీ, ఐస్‌క్రీం బండ్లు తమ గ్రామాల్లోకి రాకుండా కట్టడి చేస్తున్నాయి.** – అక్షరటుడే,ఆర్మూర్




# క్యాండీలూ కల్తీమయం..

- గ్రామాల్లో క్యాండీ, ఐస్‌క్రీం బండ్లకు నోఎంట్రీ..
- తీర్మానాలు చేస్తున్న పంచాయతీలు..
- జరిమానాలు విధిస్తామని హెచ్చరిక
- చిన్నారులను అనారోగ్యాల నుంచి కాపాడుకునేందుకు యత్నం

ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ పాలకవర్గం ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుంది. చిన్నారుల ఆరోగ్యాలకు హానికరంగా మారిన ఐస్ క్రీం బండ్లు గ్రామంలోకి రాకుండా బ్యాన్ చేస్తూ గ్రామ ప్రజలు, వీడీసీ, సర్పంచ్ గ్రామ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా గ్రామంలోకి వస్తే రూ.5వేల జరిమానా విధిస్తామని తీర్మానించారు.

### కల్తీపై ఉక్కు పాదం..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్తీపై ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల హైదరాబాద్ నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో కల్తీ వస్తువులు పట్టుబడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కల్తీపై దృష్టి సారించింది. ఆహార కల్తీపై ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రకటించారు.




ఈ క్రమంలో కల్తీ వస్తువుల విక్రయాలు తమ గ్రామంలో జరుపవద్దంటూ చేపూర్ గ్రామ ప్రజలు తీసుకున్న నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో ప్రతిఒక్కరూ ముందుకు వస్తే కల్తీని కొంతమేరకైనా తగ్గించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

### చిన్నపిల్లలపై తీవ్ర ప్రభావం..



కెమికల్, రసాయనాలు కలిగిన ఐస్ క్రీంలు తినడంతో చిన్నపిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనిని నివారించడం కోసం గ్రామంలోకి ఐస్ క్రీమ్ బండ్లు రాకుండా తీర్మానం చేశాం. కల్తీ ఆహార వస్తువులకు ప్రజలు దూరంగా ఉండాలి. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా ఉద్దేశం.

– సారంగి శాంతి కుమార్, సర్పంచ్, చేపూర్

## ఐదోరోజు 32 మంది విద్యార్థులు గైర్హాజరు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మార్చి 14వ తేదీ నుంచి మొదలైన ఒక్కో పరీక్షకు దాదాపు నాలుగైదు రోజుల విరామం ఉంటోంది. దాంతో విద్యార్థులకు చదువుకోవడానికి సమయం దొరికింది. జిల్లాలో గురువారం మొత్తం 13,154 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 13,120 మంది హాజరై 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం జిల్లాలో ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్ష నిర్వహించారు. సైన్స్ పరీక్షకు రెండు పేపర్లు ఉండడంతో మొదటిరోజు ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 40 మార్కుల ప్రశ్నాపత్రం ఇచ్చారు. మంగళవారం బయాలజీ పరీక్ష నిర్వహించనున్నారు. దానికి సైతం 40 మార్కుల ప్రశ్నాపత్రం ఇవ్వనున్నారు. కేవలం 40 మార్కుల ప్రశ్నాపత్రం కావడంతో



సైన్స్ పరీక్ష కేవలం గంటన్నర మాత్రమే సాగింది. ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్ష సమయం కేటాయించారు.

## గ్రామాలను అభివృద్ధే చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్:** గ్రామాలను అభివృద్ధే చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పెద్దకొడప్‌గల్ మండలంలోని తలబ్ తండా సర్పంచ్ జాదవ్ సుమిత్ర బాయి అన్నారు. తండాలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలు, తండాలు బాగుపడినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రతిగ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తపన ఆయనలో ఉందన్నారు. ప్రజాపాలన ప్రగతి నివేదన భాగంలో తమ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని.. ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చే విధంగా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని సభలో పేర్కొన్నారు. అంతేకాకుండా తండాలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత కరెంట్, రుణమాఫీ ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. 99రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమలు చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని తెలిపారు.

## లింగంపేట సొసైటీ లెక్కలను బహిర్గతం చేయాల్సిందే..



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట సొసైటీ లెక్కలను బహిర్గతం చేయాల్సిందేనని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఈవో పెంటయ్యకు రైతులు వినతిపత్రం అందజేశారు. లింగంపేట సహకార సంఘానికి రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానం ఉందని రైతులు పేర్కొన్నారు. గతంలో ఈ సంఘం ఉత్తమ సొసైటీగా ఎన్నికైందన్నారు. అయితే సొసైటీ తరపున లింగంపేటలో వ్యాపార సముదాయాలను నిర్మించి అద్దెకిచ్చారని.. వాటికి సంబంధించిన లావాదేవీలు రైతులకు తెలియజేయట్లేదని వాపోయారు. లింగంపేట సొసైటీలో ఇటీవల రైతులకు చెప్పకుండా మహాజన సభను నిర్వహించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ సిబ్బంది తీరుపై రైతులు విస్మయానికి గురయ్యారు. సొసైటీ పరిధిలోని మడిగెల వివరాలను తప్పనిసరిగా రైతులు వెల్లడించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

## కార్పెంటర్ షాప్‌లో ఫర్నిచర్ దగ్ధం




**అక్షరటుడే, కామారెడ్డి:** అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ఫర్నిచర్ షాప్ పూర్తిగా దగ్ధమైంది. అలాగే షాప్ పైన ఉన్న ఇల్లు కూడా ధ్వంసమైంది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. దేవునిపల్లి గ్రామంలోని 12వ వార్డులో వడ్ల బాల్‌చంద్రం 30ఏళ్లుగా తన కుమారులతో కలిసి ఇంటి కింద భాగంలో కార్పెంటర్ షాపు నడుపుతూ పైన ఉంటున్నారు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి పనులు ముగించుకుని ఇంట్లోకి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 4:30 సమయంలో పొగ రావడాన్ని బాల్‌చంద్రం గమనించాడు. కాసేపటికే మంటలు వ్యాపించడంతో ఎదురుగా ఉన్నవాళ్లు చూసి అప్రమత్తమయ్యారు. అప్పటికే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ఇంట్లో ఉన్నవాళ్లు కిందకు వచ్చారు. ఇంట్లో ఉన్న ముఖ్యమైన సామగ్రిని కిందకు తెచ్చారు. ఈ క్రమంలో బాలచంద్రం భార్య శారదకు మంటల ధాటికి చేతికి, కాలికి స్వల్ప గాయాలయ్యాయి. కార్పెంటర్ షాపులో ఫర్నిచర్ భారీగా ఉండడంతో మంటలు దట్టంగా వ్యాపించి ఫర్నిచర్, కార్పెంటర్ మిషన్లు కాలిపోయాయి. భారీగా మంటలు వ్యాపించడంతో ఇంటి పైభాగానికి మంటలు తగిలి ఇంటికి క్రాక్స్ ఏర్పడ్డాయి. ఫ్లోరింగ్ పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫైరింజన్ సమయానికి రావడంతో పెనుప్రమాదం తప్పింది. మంటలు ఇంట్లోకి వ్యాపించి ఉంటే ప్రాణనష్టం సంభవించేదని స్థానికులు తెలిపారు.

## ఒకే పనికి రెండు సర్వీస్ రూల్స్ పెట్టడం బాధాకరం..

**అక్షరటుడే, కామారెడ్డి:** ఒకే పనికి రెండు సర్వీస్ రూల్స్ వర్తింపజేయడం బాధాకరమని విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ హరికృష్ణ అన్నారు. కామారెడ్డి విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యాలయ ఆవరణలోనే వంటలు చేసుకుని అక్కడే భోజనం చేసి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నాటి సర్వీస్ రూల్స్ తొలగించాలని, ఏపీఎస్‌బీ కన్వర్షన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ భీంరాజ్, కామారెడ్డి డివిజన్ జేఏసీ ఛైర్మన్ సునీల్ గౌడ్, కన్వీనర్ రంజిత్ యాదవ్, స్వామి, కామారెడ్డి జిల్లా కన్వీనర్ జయసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గుడిసె దగ్ధం.. గండివేట్‌లో ఘటన



**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో గురువారం ఉదయం ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది. బంగారు పుస్తెల తాడు, గుండ్లు, కాళ్లపట్టీలు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండిపేట్ గ్రామంలోని గంగవ్వకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మృతి చెందిన అనంతరం ఆమె తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. అనంతరం గుడిసెలో ఒంటరిగానే ఉంటుంది. అయితే పని నిమిత్తం బుధవారం గంగవ్వ వేరే గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో ఆమె గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో గుడిసెలో ఉన్నటువంటి బంగారు పుస్తెతో పాటు గుండ్లు, కాళ్ల పట్టీలు, పట్టగొలుసులు, వంట సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయని గ్రామస్థులు తెలిపారు. ఫైరింజన్‌కు సమాచారమిచ్చిన గ్రామస్థులు అది వచ్చేలోపు స్థానికంగా ఉన్న బోరు నుంచి నీటిని తీసుకొచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. సంఘటనా స్థలానికి రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెళ్లి పంచనామా చేశారు.

## ‘చలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్’ విజయవంతం చేయండి




**అక్షరటుడే, ఆర్మూర్:** పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఈనెల 6న హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్, నాయకులు వినోద్ కోరారు. ఆర్మూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం గాకముందే ముందస్తు పేరుతో అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థపై కఠినచర్యలు తీసుకోవాలని డీఐఈవోకు వినతిపత్రం అందజేసినా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏరియా ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామస్థులకు లేబర్ కార్డులపై అవగాహన

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రాజెక్ట్ హైదరాబాద్ బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు సురక్షిత వలస విధానాలు, లేబర్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. యువత, మహిళలకు అందుబాటులో ఉన్న నైపుణ్య శిక్షణ, ఎమిగ్రేట్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, వీవోఏ, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ డబ్ల్యూడబ్ల్యూటీ ప్రతినిధులు బాలకృష్ణ, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్‌లో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని లక్ష్మాపూర్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆరో రోజు వలంటీర్లు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికలను తప్పనిసరిగా బడికి పంపాలని. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాణి, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ రావడం లేదని చెట్టెక్కి నిరసన.. గ్రామసభలో ఘటన



**అక్షరటుడే, కామారెడ్డి:** అతనికి ప్రతినెలా పింఛన్ వచ్చేది. అయితే కొద్దికాలంగా నిలిచిపోయింది. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో అతను చెట్టెక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన భిక్కనూరు మండలం కంచర్లలో గురువారం చోటుచేసుకుంది. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గురువారం కంచర్లలో గ్రామసభ నిర్వహించారు. అయితే సభలో పలువురు గ్రామస్థులు తమ సమస్యలను అధికారులు, నాయకులకు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గొల్ల రాములు తనకు గతంలో పింఛన్ వచ్చేదని, ప్రస్తుతం నిలిచిపోయిందని సభ దృష్టికి తీసుకువచ్చాడు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరవడం లేదని అసహనం వ్యక్తం చేస్తూ పక్కన ఉన్న చెట్టుపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. దీంతో పింఛన్ మంజూరయ్యేలా కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.